
సాక్షి బాపట్ల

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

చెరుకుపల్లి: ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ చెరుకుపల్లి తెనాలి ప్రధాన రహదారిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టింది. బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 508.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5500, గరిష్ట ధర రూ.7000, మోడల్ ధర రూ.6500 వరకు పలికింది.

న్యూస్‌రీల్

పర్చూరు అసెంబ్లీ పరిశీలకునిగా తూమాటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పర్చూరు అసెంబ్లీ పరిశీలకునిగా ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు మురుగుడు లావణ్య నామినేషన్

మంగళగిరి: వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య ఈనెల 19న నామినేషన్ వేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్లరామకృష్ణారెడ్డి(ఆర్కే) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు పట్టణంలోని సీతారామ కోవెల నుంచి బయల్దేరి ర్యాలీగా మెయిన్ బజార్ మీదుగా గౌతమ బుద్ధా రోడ్డు చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడ నుంచి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తూర్పు నుంచి నూరి ఫాతిమా..

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా షేక్ నూరిఫాతిమా ఈనెల 19న నామినేషన్ దాఖలు చేస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పిలుపునిచ్చారు. మంగళదాస్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీనేతలంతా కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రింటర్స్ వివరాలు ప్రకటించడం తప్పనిసరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు అభ్యర్థుల ప్రచారం కోసం ప్రచురించే కరపత్రాలు, పోస్టర్స్‌పై తప్పనిసరిగా ప్రింటర్, పబ్లిషర్ల వివరాలు, చిరునామా సహా ప్రింట్ చేయాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివరాల వల్ల ప్రింటింగ్ ఖర్చులకు బాధ్యుల్ని గుర్తించడం తేలికవుతుందని ఆమె పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఆమె కోరారు.

24 నుంచి ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి కారంగుల సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి మే 26 వరకు సత్తెనపల్లిలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్, పాఠశాల పీడీ షేక్ మహ్మద్ రియాజ్ బుధవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో ఆసక్తి గల క్రీడాకారులు, బాలబాలికలు పాల్గొనాలని ఆయన కోరారు. వివరాలకు 9701052588, 7396967776 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో అర్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా 9వ రోజైన బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో అర్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష పుష్పార్చన నిర్వహించారు. తొలుత ఆలయ ఈవో కేఎస్ రామరావు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి అమ్మవారి పుష్పార్చన నిమిత్తం సేకరించిన పుష్పాలతో ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. రాజగోపురం వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరిన ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- 25వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు అవకాశం
- 26న నామినేషన్ల పరిశీలన
- 27వ తేదీ నుంచి 29 వరకు ఉపసంహరణ గడువు
- అసెంబ్లీ స్థానాలకు నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ
- బాపట్ల లోక్‌సభ స్థానానికి కలెక్టర్ కార్యాలయంలో..
- నామినేషన్లు స్వీకరించనున్న ఈఆర్వోలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దారు, ఆర్డీఓ కేంద్రాల్లో చేపట్టనున్నారు. బాపట్ల, పర్చూరు, వేమూరు, అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్లను ఆయా తహసీల్దారు కార్యాలయాల వద్ద సమర్పించాల్సి ఉంటుంది. అక్కడి ఈఆర్వోలు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రేపల్లె, చీరాల అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నామినేషన్లు స్థానిక ఆర్డీఓ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంది. అక్కడి ఈఆర్వోలు వాటిని స్వీకరించనున్నారు. బాపట్ల లోక్‌సభ స్థానానికి సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందన హాలు పక్కన ఏర్పాటు చేసిన కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు.

నిబంధనలు ఇలా....

- 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు.
- ఒక్కొక్క అభ్యర్థి ఒకేసారి లేదా పలు దఫాలుగా నాలుగు సెట్ల వరకూ నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
- పోటీ చేసే అభ్యర్థి తరఫున అభ్యర్థి లేదా ప్రతిపాదకుడు నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చు.
- ఒక అభ్యర్థి పార్లమెంట్ లేదా ఏదైనా అసెంబ్లీకి రెండు స్థానాల్లో మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంది.
- అభ్యర్థి(జనరల్ కేటగిరి ఐతే) సెక్యూరిటీ డిపాజిట్ కింద అసెంబ్లీ స్థానానికి రూ.10 వేలు, లోక్‌సభ స్థానానికి రూ.25 వేలు చలనా చెల్లించాలి.
- రిజర్వుడు స్థానానికి అయితే అసెంబ్లీ స్థానానికి రూ.5 వేలు, లోక్‌సభకు రూ.12,500 చెల్లించాలి.
- అసెంబ్లీకి ఫారం-2బీ, పార్లమెంట్‌కు ఫారం-2 ఏ, అఫిడవిట్-26 సమర్పించాలి. ఇది కచ్చితంగా స్టాంపు పేపర్ పైనే ఇవ్వాలి.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫారం-ఏ, ఫారం-బీ సమర్పించాలి.
- స్వతంత్ర్య అభ్యర్థులు ఫారం-ఏ, ఫారం-బీలు సమర్పించాల్సిన అవసరం లేదు.
- గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు ఒక్కరూ ప్రతిపాదకులు సరిపోతుంది.
- స్వతంత్ర్య అభ్యర్థులకు పదిమంది ప్రతిపాదకులు ఉండాలి.
- అసెంబ్లీ అభ్యర్థులకు రాష్ట్రంలో ఎక్కడైనా ఒకచోట ఓటు ఉంటే సరిపోతుంది.
- పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థికి దేశంలో ఎక్కడ ఓటు హక్కు ఉన్నా సరిపోతుంది.
- అయితే ఓటు ఉన్నచోట నుంచి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ద్వారా ధ్రువీకరణ పత్రం తెస్తే సరిపోతుంది.
- అభ్యర్థులు మూడు నెలల క్రితం తీయించుకున్న ఫొటో ఇవ్వాలి, దాని వెనుక సంతకం పెట్టాలి. నామినేషన్ ఫారంతో పాటు అఫిడవిట్ పైనా స్టాంపు సైజు ఫొటో అతికించాలి.
- రిజర్వుడు అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఇవ్వాలి.
- ప్రమాణపత్రమూ సమర్పించాలి.
- పోటీ చేసే అన్ని కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ప్రభుత్వ సంస్థలకు(గెస్ట్‌హౌస్, టెలిఫోన్, విద్యుత్ బిల్లుల వంటివి) ఎటువంటి బకాయిలు లేవన్న నోడ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాలి.
- నామినేషన్ సమయానికి బకాయిలు ఉన్నా నోటీసు ఇచ్చిన గడువులోగా వాటిని చెల్లించాలి.

ఉదయం 11 గంటల నుంచి

గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ప్రతిరోజు నిర్ణీత సమయంలోగా నామినేషన్ పత్రాలు అందజేయాల్సి ఉంది. ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో నామినేషన్లు వేసుకోవచ్చు. ఈ నెల 26వ తేదీ 11 గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 27, 28, 29 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఫారం-5 ద్వారా నామినేషన్ ఉపసంహరించుకోవచ్చు. గురువారం నుంచి నామినేషన్ల నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ నేతృత్వంలో పోలీసుశాఖ భారీ భద్రత ఏర్పాట్లు చేసింది. నామినేషన్లు వేసే ప్రాంతానికి వంద మీటర్ల దూరంలోపలికి అభ్యర్థితో పాటు మూడు వాహనాలు ఐదుగురు వ్యక్తులు మినహా ఎవ్వరిని అనుమతించరు. ఆర్వో కార్యాలయాల వద్దకు ర్యాలీలు నిషిద్ధం. అభ్యర్థులు వారికి కేటాయించిన సమయంలో నామినేషన్లు వేసుకోవాలి. టపాసులు కాల్చకూడదు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొనేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధంగా ఉంది.

నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు



సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి మొదలైంది. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని ఈఆర్వోల వద్ద నామినేషన్లు దాఖలు చేయాలి. బాపట్ల లోక్‌సభకు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గదిలో నామినేషన్లు వేస్తారు. ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉంది. అభ్యర్థులు నిబంధనల మేరకు అన్ని డాక్యుమెంట్లు సమర్పించి నామినేషన్లు వేయవచ్చు. ఇప్పటికే ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం.

– రంజిత్‌బాషా, జిల్లా కలెక్టర్, బాపట్ల జిల్లా

నామినేసన్ల ప్రక్రియకు భారీ బందోబస్తు



నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రతి ఈఆర్వో కేంద్రం వద్ద ఒక డీఎస్పీ స్థాయి అధికారితో పాటు పెద్ద ఎత్తున పోలీసు బలగాలు ఉంటాయి. వంద మీటర్ల లోపలికి మూడు వాహనాలు, అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతిస్తాం. ఒకేసారి ఇరుపార్టీలు రాకుండా వారికి సమయం కేటాయిస్తాం. ఆర్వో కేంద్రాల వద్ద బాణసంచా కాల్చకూడదు. ఇతరులను రెచ్చగొట్టేలా నినాదాలు చేయకూడదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యం.

– జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకుందాం

రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి ఈవూరి గణేష్



ఆరేపల్లిలో ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు పదికాలల పాటు అందాలంటే మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని, అందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మండలంలోని ఆరేపల్లి సచివాలయ పరిధిలోని కురప్పాలెం, వాకావారిపాలెం, ఆరేపల్లి ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా మన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున చేసినట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో వచ్చిన మార్పును ప్రజలు గమనించాలని కోరారు. ముఖ్యంగా రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. గత టీడీపీ పాలనలో పేద ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి ధనార్జనే ధ్యేయంగా పాలన సాగించారని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు ఎన్డీయే కూటమి నేతలు సిద్ధం అయ్యారని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, స్థానిక సర్పంచి మొగలిపువ్వు కోటేశ్వరరావు, నాయకులు తూము కోటేశ్వరరావు, పీటా రాంబాబు, గాలి నాగమౌళి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు ఘనత వైఎస్ జగన్‌దే

బాపట్ల ఎంపీ నందిగం సురేష్



ఇంటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న నందిగం సురేష్

ఇంటూరు(వేమూరు): పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. అమృతలూరు మండలం ఇంటూరులో ఎన్నికల ప్రచారం బుధవారం పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమరావతి ప్రాంతంలో కులాలకు సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. పేదలకు అన్యాయం చేసిన చంద్రబాబు పెత్తందారులకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, బానిసత్వం సంకెళ్ల నుంచి బయటకు తీసుకొని వచ్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల చాలా మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వరికూటి అమృతపాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మూల్పూరు లావణ్య, గ్రామ సర్పంచి మద్దు జీవమణి, వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాది గుమ్మడి రవిరాజు, బటు మోషే, చదలవాడ రమేష్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం



మహిళలతో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

- అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

అద్దంకి: పేద ప్రజలను అణగదొక్కుతూ పెత్తందార్లకు కొమ్ముకాయడమే చంద్రబాబు ముఖ్య లక్ష్యమని వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పేరాపాలెం, మోదేపల్లి గ్రామాలలో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఈ సారి సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని హెచ్చరించారు. చంద్రబాబును ఎవరు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. జగనన్నకు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన జగనన్న గెలుపు ఆపలేరని పేర్కొన్నారు. నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన తనకు, తన కుటుంబ సభ్యులను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్, అసెంబ్లీ అభ్యర్థిగా తనకు ఫ్యాన్‌గుర్తుపై రెండు సార్లు బటన్‌నొక్కి ఆశీర్వదించాలని కోరారు. రెండు గ్రామాల్లోని ప్రజలు హనిమిరెడ్డికి బ్రహ్మరథం పట్టారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయండి

ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల పట్టణంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: అభివృద్ధి.. సంక్షేమం చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. బాపట్ల పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయటంతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని చెప్పారు. టెంపుల్‌టౌన్‌గా అభివృద్ధి చేయటంతోపాటు శాశ్వత మంచినీటి పరిష్కారానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఒక పక్కన అభివృద్ధి మరోవైపు సంక్షేమ ఫలాలు కొనసాగించటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని పేర్కొన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, పూర్తిగా వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకుపోతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, ఆదిలక్ష్మి, చింతల రాజశేఖర్, వడ్డిముక్కల డేవిడ్, అంకమ్మరావు పాల్గొన్నారు.

రామదర్శనం.. జన్మధన్యం..




ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు ఉత్సవ మూర్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీరామచంద్రుడి దర్శనం జన్మధన్యం అంటూ భక్తజనం రఘురాముడిని మనసారా కొలిచారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శ్రీరామ నవమి వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత శ్రీ వీరాంజనేయ స్వామివారి సన్నిధి నుంచి హనుమత్ సమేత సీతారామలక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, వేద పండితులు కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు.

అవమానాలు.. అవహేళనలు

- పొత్తు ధర్మం పాటించని తెలుగుదేశం
- కక్కలేక మింగలేక కుమిలిపోతున్న కమలనాథులు
- పవన్ కల్యాణ్ సమక్షంలో సైతం వేదికపైకి పిలవని వైనం
- ఒక్కొక్కరుగా బీజేపీకి గుడ్‌బై చెబుతున్న నాయకులు



సాక్షి ప్రతినిధి గుంటూరు : కూటమి పొత్తుల్లో అనుమానాలు, అవమానాలే కనపడుతున్నాయి. ఒకరినొకరు నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. బీజేపీనైతే అసలు పరిగణనలోకే తీసుకోవడం లేదు. అడుగడుగునా వారికి అవమానాలే ఎదురవుతున్నాయి. తామే కలిసి పని చేయాలని ముందుకు వెళ్లినా వారిని అంటరాని వారిగానే తెలుగుదేశం నేతలు చూస్తున్నారు. దీంతో బీజేపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. పొత్తు పొడవక ముందు ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించి ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులు గట్టిగా ప్రయత్నాలు చేసుకున్నారు. ప్రజల్లోకి వెళ్లారు. రెండేళ్లుగా అన్ని నియోజకవర్గాల్లో సొంతంగా పోటీ చేసేందుకు డబ్బులు ఖర్చు పెట్టుకుని ఎదురుచూస్తున్న సమయంలో అధిష్టానం టీడీపీ, జనసేతో పొత్తుపెట్టుకోవడంతో బీజేపీ అభ్యర్థులు నిరాశకు లోనయ్యారు. అయితే పొత్తు పొడిచిన తర్వాత గుంటూరు పశ్చిమ సీటు కోసం బీజేపీ నేతలు గట్టిగా పట్టుపట్టారు. కానీ గుంటూరు జిల్లాలో ఒక్క సీటు కూడా బీజేపీకి దక్కలేదు. అయినా పొత్తు ధర్మం ప్రకారం కలిసి పనిచేద్దామనుకున్న వారికి తెలుగుదేశం పార్టీ నుంచి అవమానాలే ఎదురవుతున్నాయి. కనీసం బహిరంగ సభల్లో వేదికపైకి కూడా పిలవకపోవడంతో అవమాన భారంతో వెనుతిరుగుతున్నారు. ముఖ్యంగా పార్టీ కేడర్ తమకు పొత్తు వల్ల తగినంత ప్రాతినిధ్యం లభించడం లేదని కమలాన్ని వీడుతున్నారు. ఇటీవల బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ స్టేట్ కో కన్వీనర్ డాక్టర్ టి.వి.రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు పార్టీని వీడారు. మరికొంత మంది సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు.

పట్టించుకోని టీడీపీ నేతలు

పొత్తు ధర్మాన్ని ఏనాడూ పాటించని టీడీపీ నేడు కూడా అదే పంథా కొనసాగిస్తోంది. పొత్తులో భాగంగా జిల్లాలో ఉమ్మడి అభ్యర్థి ప్రచార కార్యక్రమాలకు బీజేపీ నేతలను తూతూమంత్రంగా పిలుస్తున్నారు. కొంత మందికి కనీసం పిలుపు కూడా ఉండటం లేదు. సమాచారం చెప్పాం అని పించుకునే విధంగా ఫోన్‌లో మెసేజ్ పంపించి వదిలివేస్తున్నారే తప్పా కనీసం ఫోన్ చేసి కూడా తమను ఆహ్వానించడం లేదని బీజేపీ నేతలు వాపోతున్నారు. సభావేదిక వద్దకు ఒకరిద్దరిని పిలిచినా తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో కమలనాథులు కుమిలిపోతున్నారు.

కండువాలు వేసుకోవడం లేదు .. జెండాలు పట్టుకోవడం లేదు

పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలకు కేవలం గుంటూరు జిల్లాలో టీడీపీ జెండాలు పట్టుకొని ప్రచారం నిర్వహిస్తున్నారే తప్పా బీజేపీ జెండాలు ఎక్కడా కనిపించడం లేదు. కనీసం ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి కూడా కేవలం పసుపు జెండానే భుజాన వేసుకుని ప్రచారం చేస్తున్నారు తప్పా మిత్ర ధర్మంగా కమలనాథులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పార్టీ నాయకులు, ముఖ్యంగా కార్యకర్తలు సైతం టీడీపీపై గుర్రుగా ఉన్నారు. ప్రచార వాహనాల రథాలపై సైతం చంద్రబాబు నాయుడు, సైకిల్ గుర్తుల ఫొటోలే గానీ ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో, కమలం గుర్తు ఫొటోలు మచ్చుకైనా ఒక్కటి కూడా కనిపించడం లేదు. ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగి పార్టీలో ఎప్పటి నుంచో ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ మిత్ర ధర్మం పేరుతో తమను అణగ దొక్కుతున్న వైనంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాబుకు ఫిర్యాదు

ఉమ్మడి అభ్యర్థుల ప్రచార కార్యక్రమాల్లో తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండటం లేదని, పలువురు బీజేపీ నేతలు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబుకు పలు పర్యాయాలు ఫిర్యాదు చేశారు. నరసరావుపేట పర్యటన, బాపట్ల పర్యటనలో ఉన్న సమయాల్లో చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అయినా కూడా వారిలో మార్పురాలేదు. తాజాగా ప్రత్తిపాడులో చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో జనసేన నేతలను వేదికపైకి పిలిచి మాట్లాడించిన నేతలు , కనీసం బీజేపీ నేతలను వేదిక మీదకు కూడా పిలవలేదు. రెండురోజుల కిందట తెనాలిలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కూడా బీజేపీని వేదిక పైకి ఆహ్వానించలేదు. ఆయన సమక్షంలో కూడా వారికి అవమానం ఎదురవడంతో నేతలు కుమిలిపోతున్నారు.

క్లుప్తంగా

కాల్వలో ఈతకు దిగి విద్యార్థి మృతి



మేడికొండూరు: కాల్వలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన సంఘటన మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణానికి చెందిన ఇంకొల్లు నాగేశ్వరరావు కుమారుడు కార్తీక్ (21) మండల పరిధి సమీపంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. బుధవారం శ్రీరామ నవమి పర్వదినం కావడంతో స్నేహితులతో కలిసి గుడికి వెళ్లి వస్తానని చెప్పి పేరేచర్ల గ్రామ శివారులోని బ్రాంచ్ కెనాల్ వద్దకు ఈతకు వెళ్లాడు. కాల్వలో ఈతకు దిగిన కార్తీక్ నీటి ప్రభావం ఎక్కువగా ఉండి గల్లంతయ్యాడు. అతనితో వచ్చిన స్నేహితులు కార్తీక్ గల్లంతైన విషయం పోలీసులకు తెలియజేయడంతో మేడికొండూరు సీఐ జయకుమార్, సిబ్బందితో కలిసి కార్తీక్ కోసం వెతుకులాట ప్రారంభించారు. సాయంత్రం గల్లంతైన కార్తీక్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటికుంటలో పడి వృద్ధుడి దుర్మరణం



చీరాల: బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి వృద్ధుడు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం మండలంలోని విజయనగర్‌కాలనీ గ్రామలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు అందించిన వివరాలు.. విజయనగర్ కాలనీకి చెందిన మోటూరి జయరావు(60) బుధవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటి కుంటలో పడి మృతి చెందాడని స్థానికుల నుంచి సమాచారం అందింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి శవపరీక్ష నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి వెంకటేష్
- థామస్‌పేట నుంచి పార్టీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో వెంకటేష్

చీరాల: రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే.. చీరాలలో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం రామకృష్ణాపురంలోని వెంకటేష్ క్యాంపు కార్యాలయంలో థామస్‌పేటకు చెందిన 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలు అమలు చేసినట్లు చెప్పారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ చేసిన పాలన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తెచ్చి ప్రజల వద్దకు సంక్షేమాన్ని తీసుకెళ్లిన ఘనత జగనన్నకే దక్కుతోందని పేర్కొన్నారు. యాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ మీద రాళ్లతో దాడి చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. మే 13వ తేదీన ప్రజలందరూ ఫ్యాన్ బటన్ నొక్కి మహా కూటమికి బుద్ధి చెబుతారని చెప్పారు. పార్టీ బలోపేతానికి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరు సమష్టిగా పని చేయాలని వెంకటేష్ సూచించారు. రాబేయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ గెలుపునకు అంకితభావంతో కృషి చేస్తామని థామస్‌పేటకు చెందిన దాసరి రూపసుమ, బీఎస్పీ పార్టీ నుంచి మరో 30 కుటుంబాల వారు వెంకటేష్‌కు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించుటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కోంద్రు బాబ్జి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

వేమూరు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



ఇంటూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వరికూటి అశోక్‌బాబు

ఇంటూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించినట్లు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమృతలూరు మండలం ఇంటూరులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతోందని పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల ఆశీస్సులు అవసరం ఉండేదని ఎద్దేవా చేశారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. తద్వారా ఖరీదైన విద్య, వైద్యం పేదలకు ఉచితంగా లభించినట్లు వివరించారు. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెడితే టీడీపీ అడ్డంకులు సృష్టించేలా కోర్టులను ఆశ్రయించిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల పరిశీలకుడు గాదె శివరామకృష్ణా రెడ్డి, గ్రామ సర్పంచి మద్దు జీవమణి, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు మూల్పూరు లావణ్య, పార్టీ మండల అధ్యక్షుడు యలవర్తి సురేష్, వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది గుమ్మడి రవిరాజు, జేపీసీ చైర్మన్ బట్టు మోషే, మోదుకూరి హరిబాబు, ఎంపీటీసీలు కోలాటం ఆనంద్‌కుమారి, తమ్మా వెంకట రెడ్డి, వైస్ ఎంపీపీ కూచిపూడి శ్రీనివాసరరావు, దేవర కొండ సత్యవతి, సీనియర్లు నాయకులు డి.కృష్ణా రెడ్డి, ఆవుతు ముత్త రెడ్డి, వి సురేష్, సర్పంచులు కె.కిరణ్‌బాబు, డి.రాము పాల్గొన్నారు.

వినూత్న క్రికెట్ సైట్ స్క్రీన్‌కు పేటెంట్



పేరేచర్లలోని గుంటూరు క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన సైట్‌స్క్రీన్



భారీ గాలులు వీచినప్పుడు ఇలా..

తక్కువ ఖర్చుతో ఆవిష్కరించిన జాగర్లమూడి మురళీమోహన్



గుంటూరు ఎడ్యుకేషన్: జేసీల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, జేకేసీ కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ నూతన ఆవిష్కరణకు పేటెంట్ లభించింది. కోల్‌కత్తాలోని ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం మంగళవారం ఈ మేరకు ధ్రువపత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా తాను చేసిన నూతన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం వివరించారు. క్రికెట్ మైదానంలో పిచ్‌కు ఇరువైపులా బ్యాట్స్‌మెన్, బౌలర్ల దృష్టి మరలకుండా ఉండేందుకు రెండు పెద్ద తెరలు (సైట్ స్క్రీన్) ఉంచుతారు. వాటికి నలుపు, తెలుపు వస్త్రాలు ఉపయోగిస్తారు. వీటిని తయారు చేయటం, వినియోగించడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. తుపానులు, గాలి వానలు వచ్చినప్పుడు కూలిపోవడం, పాడైపోవడం జరుగుతుంది. ఇందుకు సంబంధించి తేలికగా నలుపు, తెలుపు రంగులు మారేవిధంగా ఖనిజంతో సైట్ స్క్రీన్ తయారు చేశారు. గాలి ధారాళంగా వెళ్లేవిధంగా, తుపానులో సైతం పడిపోని విధంగా ఈ స్క్రీన్‌ను తయారు చేశారు. చాలా సులభంగా పిచ్‌లకు ఎదురుగా, బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా సైట్ స్క్రీన్‌ను కదిలించడంతో పాటు వీలుగా ఉండే విధంగా అమర్చుకోవచ్చు. మెన్, ఉమెన్ క్రికెట్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు, ఏసీఏ ఉమెన్స్ అకాడమీ పూర్వ చైర్మన్ అయిన మురళీమోహన్ సరికొత్త ఆలోచనతో అతి తక్కువ ఖర్చుతో చేసిన నూతన ఆవిష్కరణకు 20 ఏళ్ల పాటు పేటెంట్ లభించింది. ఈ ఆవిష్కరణ క్రికెట్ క్రీడకు ఎంతో ఉపయోగపడుతుంది. జాగర్లమూడి కుటుంబానికి క్రికెట్ క్రీడతో అవినాభావ సంబంధం ఉంది. వీరి తండ్రి జాగర్లమూడి చంద్రమౌళి ఏసీఏకు అధ్యక్షుడిగా వ్యవహరించడంతోపాటు గుంటూరు క్రికెట్ క్లబ్‌ను స్థాపించారు. చంద్రమౌళి కుమారులు నరేంద్రనాథ్, మురళీమోహన్ క్రికెట్ ఆటలో గతంలో ఆంధ్ర లయోలా కళాశాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ నేపథ్యంలో మురళీమోహన్ పేటెంట్ సాధించడం అభినందనీయమని క్రీడా ప్రముఖులు కొనియాడారు.

సాగర్ జలాలు చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు

ఎన్ఎస్‌పీ డీఈఈ చాట్రగడ్డ రామారావు



శావల్యాపురం: సాగర్ జలాలు చేపల చెరువులకు వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ (ఎన్ఎస్‌పీ) డీఈఈ చాట్రగడ్డ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి సాగర్ జలాలు విడుదల చేయగా, పోట్లూరు మేజరు కాల్వను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గండికొట్టి నీటిని దారి మళ్లించారు. ఘటనాస్థలాన్ని సందర్శించిన డీఈఈ మాట్లాడుతూ సాగర్ జలాలు ప్రజల తాగునీటి అవసరాల కోసం మాత్రమే ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. ఈక్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పోట్లూరు మేజరు కాల్వ నుంచి శావల్యాపురం మంచినీటి చెరువుకు వచ్చే కాల్వను పోట్లూరు గ్రామ సమీపంలో పగలకొట్టగా నీరు అంతా మరో మార్గం వైపు మళ్లించారన్నారు. దీంతో పోట్లూరు మేజరుకు వచ్చే సాగర్ జలాలను నిలుపుదల చేసి అనంతరం పొక్లెయిన్ ద్వారా కాల్వకు మరమ్మతులు చేయించామన్నారు. ఎన్నెస్పీ ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ లిఖిత పూర్వకంగా పోలీసులు ఫిర్యాదు చేసి కాల్వను పగలగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోట్లూరు మేజరు కాల్వ ద్వారా సాగర్ జలాలు విడుదల చేశారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్, ఎన్నెస్పీ అధికారులు నందకిషోరు ఉన్నారు.

కారంచేడు మృతవీరులకు నివాళి



రుధిర క్షేత్రం వద్ద నివాళులర్పిస్తున్న జననాట్య మండలి బృందం సభ్యులు

చీరాల రూరల్: రుధిర క్షేత్రం వద్ద కారంచేడు మృతవీరులకు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం చీరాల విజయనగర్ కాలనీలోని జనచైతన్య నాయకురాలు విమలక్క బృందం జోహార్లు అర్పించింది. ఆమె మాట్లాడుతూ. నవ్యాంధ్రకు ప్రత్యేక హోదాతో పాటు ప్రజా అజెండాను చాటుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘా సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జన చైతన్యయాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఈ యాత్ర నెల్లూరు నుంచి ప్రకాశం, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, రాజమండ్రి, తూర్పుగోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల మీదుగా మే 5న శ్రీకాకుళం జిల్లాలోని బొడ్డపాడు గ్రామంలో ముగిస్తుందని చెప్పారు. 21 రోజులు పాటు సాగే ఈ యాత్రలో కండలేరు ముంపునకు గురైన ప్రాంతాలు, దళితులు హత్యా కాండకు గురైన కారంచేడు, చుండూరు, పోలవరం నిర్వాసితుల గ్రామాల సందర్శన, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటామని వివరించారు. ఈయాత్రకు భావసారూప్యత కలిగిన శక్తులు, వ్యక్తులు తమకు సంఘీభావం తెలిపాలని ఆమె కోరారు.

అంతరిక్ష శాస్త్రవేత్త సుబ్బారావుకు ఆర్యభట్ట అవార్డు

- డిస్టింగ్విష్డ్ ఫెలో బిరుదుతోనూ సత్కారం
- అహ్మదాబాద్‌లో ఏఎస్ఐతో ప్రదానం



డాక్టర్ సుబ్బారావుకు అవార్డు ప్రదానం చేస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ/చైర్మన్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ప్రతిష్టాత్మక గౌరవం అందుకున్నారు. భారతదేశంలో ఆస్ట్రోనాటిక్స్ ప్రమోషన్స్‌కు డాక్టర్ సుబ్బారావు చేసిన జీవిత కాల అద్భుత సహకారానికి గుర్తింపుగా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ),'ఆర్యభట్ట' అవార్డు, 'డిస్టింగ్విష్డ్ ఫెలో' బిరుదును ప్రదానం చేసింది. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో బుధవారం ఏర్పాటైన ప్రత్యేక సభలో ఏఎస్ఐ అధ్యక్షుడు, ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్ చేతులమీదుగా స్వీకరించారు. డాక్టర్ సుబ్బారావు తొలుత ఇస్రోలో శాస్త్రవేత్తగా చేశారు. అత్యంత అధునాతన ఏవియానిక్స్‌ను స్వదేశీయంగా రూపొందించి, అభివృద్ధి చేయాలనే భావనతో 1992లో అనంత్ టెక్నాలజీస్‌ను స్థాపించారు. ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురంలో గల అనంత్ టెక్నాలజీస్ సంస్థల్లో 1600 పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. భారత అంతరిక్ష కార్యక్రమాల కోసం ఇప్పటివరకు 98 ఉపగ్రహాలు, 78 లాంచ్ వెహికల్స్‌కు డాక్టర్ సుబ్బారావు నేతృత్వంలోని అనంత్ సంస్థ సహకరించింది.

25న ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్జేసీ డీసీ సెట్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశానికై ఈనెల 25న జరగనున్న పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5,6,7,8వ తరగతుల్లో ప్రవేశానికై ఏపీఆర్ఎస్ క్యాట్–2024 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష ఏపీఆర్‌జేసీ డీసీ సెట్–2024 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జరుగుతుందని వివరించారు. హాల్ టికెట్లను http://aprs. apcfsf.in వెబ్‌సైట్‌లో విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీ వివరాలతో బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్ నుంచి పొందిన హాల్ టికెట్లతో ఈనెల 25న జరగనున్న పరీక్షలకు సంబంధిత కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

దాడిని వక్రీకరిస్తున్న బాబు వైఖరి హేయం

- సీఎంపై దాడి నిందితులకు వత్తాసు పలికేలా మాట్లాడుతున్న వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
- ఏపీ ప్రభుత్వ మార్కెటింగ్, కో–ఆపరేటివ్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



తాడికొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని వక్రీకరిస్తూ సభలు, సమావేశాల్లో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వైఖరి హేయనీయం, అనుమానాస్పదమని ఏపీ ప్రభుత్వ మార్కెటింగ్, కో–ఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిపై దాడి జరిగితే సానుభూతి ప్రకటించకపోను, రెచ్చగొట్టే ధోరణిలో చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. గతంలో ముఖ్యమంత్రులపై దాడులు జరిగిన సందర్భాల్లో పలువురు ప్రతిపక్ష నేతలు, రాజకీయ పార్టీల నాయకులు హుందాగా వ్యవహరించే వారని, చంద్రబాబుపై అలిపిరి దాడి జరిగిన ఘటనలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి వెళ్లి పలకరించి వచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో పర్యటనలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి పక్కా ప్రణాళికతో జరిగిందేనని, రాయి తలపై కాకుండా కంటిపై లేదా, కణతకు తగిలి ఉంటే ప్రాణాలకే ముప్పు ఉండేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఘటన వెనుక ఉన్న వారెవరో బయటకు లాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రూ.4.50 లక్షల తెలంగాణ మద్యం సీజ్


ఇద్దరు నిందితుల అరెస్ట్



ఎస్ఈబీ అధికారులు సీజ్ చేసిన మద్యంతో పాటు నిందితుడు

క్రోసూరు: పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్, అడిషనల్ ఎస్పీఆర్ రాఘవేంద్రరావు ఆదేశాల మేరకు నరసరావుపేట ఎస్ఈబీ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ నేతృత్వంలో క్రోసూరు సర్కిల్ ఎస్ఈబీ అధికారులు అచ్చంపేట మండలంలో బుధవారం దాడులు నిర్వహించారు. మాదిపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో ఒక ఇంటిపై దాడులు నిర్వహించి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 72 కేసుల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో 3456 మద్యం బాటిళ్లు(180 ఎంఎల్) పట్టుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4.50లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నిందితులు షేక్ అబ్దుల్ సత్తార్, సద్దాం హుస్సేన్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. దాడుల్లో క్రోసూరు ఎస్ఈబీ ఎస్ఐ అశోక్‌కుమర్, సిబ్బంది పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బల్లికురవ: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు... అద్దంకి మండలం చిన కొత్తపల్లికి చెందిన బండారు రాజు(52) కొడుకు మహేంద్రతో కలసి సోమవారం బల్లికురవ మండలంలోని ఎస్ఎల్ గుడిపాడులో నిర్వహించిన కొలుపులకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. వైదన గ్రామ సమీపంలో బైకు పైనుంచి రాజు కిందపడి గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని కుమారుడు చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకెళ్లారు. బుధవారం చికిత్స పొందుతూ చనిపోయాడు. మహేంద్ర ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ సి.బాలకృష్ణ కేసు నమోదు చేశారు.

కాలేయం..బహుభద్రం

- లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అందుబాటులో ఆధునిక చికిత్సలు
- రేపు వరల్డ్ లివర్ డే



లివర్‌డే పోస్టరు

గుంటూరు మెడికల్: కాలేయం (లివర్) మన శరీరంలో అతి పెద్ద గ్రంథి. లివర్ సరిగా పనిచేయకపోతే అనేక రోగాలు శరీరాన్ని చుట్టుముడతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు అనేక మంది లివర్ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ప్రజలు లివర్ వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో లివర్ క్యాన్సరుగా మారే ప్రమాదముంది. ప్రతిఏడాది ఏప్రిల్ 19న వరల్డ్ లివర్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

లివర్ బాధితులు...

గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం, శుక్రవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యవిభాగంలో 300 మంది చికిత్స పొందుతున్నారు.
వీరిలో 140 మంది లివర్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందుతున్నవారు. 2020లో 2,224 మంది, 2021లో 4,081 మంది, 2022లో 4,576మంది చికిత్స, 2023లో 4,8982 మంది వివిధ రకాల సమస్యలతో గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యవిభాగంలో చికిత్స పొందారు. వీరిలో ఎక్కువ శాతం మంది లివర్ సంబంధిత సమస్యలున్నవారేనని వైద్యులు తెలిపారు.

లివర్ చేసే పనులు...

ఉదరంలో ఉదరవితానికి కిందగా కుడి వైపున మధ్యలో కాలేయం ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయటం, జీర్ణక్రియకు దోహదపడే పైత్యరసాన్ని ఉత్పత్తి చేయటం, శరీరంలోని కొవ్వు, చక్కెర, ప్రోటీన్ శాతాన్ని నియంత్రించడం, శరీరం జబ్బు బారిన పడకుండా రక్షణ కల్పించటం, రక్త శుద్ధి చేయటం, శరీరంలోని విషాలను హరించటం చేస్తుంది. మనలో ప్రవేశించే హానికర పదార్థాలను తొలగించటం, ఆహారాన్ని శక్తి రూపంలోకి మార్చటం, వివిధ హార్మోన్ల విడుదలను నియంత్రణలో పెట్టడం, రక్తం గడ్డ కట్టడానికి, గాయాలు త్వరగా మానటానికి కావాల్సిన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేయటం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది.

కాలేయ సమస్యలకు ముఖ్య కారణాలు...

మత్తు పదార్థాలు సేవించటం, పొగతాగటం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం, ఇన్‌ఫెక్షన్స్ వల్ల కాలేయ సమస్యలు వస్తాయి. లైంగిక సంబంధాలు, ఒకరికి వాడిన సూదిని మరొకరికి వాడటం వల్ల హెపటైటిస్ బి, సి వ్యాధులు వస్తాయి. కలుషిత రక్తమార్పిడి, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవటం వల్ల హెపటైటిస్ ఏ, ఈ వ్యాధులొస్తాయి. శారీరక వ్యాయామం లేకపోవటం, స్థూలకాయం, నూనె వస్తువులు ఎక్కువగా తినటం, పిజ్జాలు, బర్గర్స్‌లు, ఫాస్ట్‌ఫుడ్ వల్ల లివర్ వ్యాధులు వస్తాయి. తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కాలేయ సమస్యలు ఉన్నట్లు భావించి వైద్యపరీక్షలు చేయించుకోవాలి.

ఉచితంగా వైద్యసేవలు...



గుంటూరు జీజీహెచ్‌లో లివర్ జబ్బులకు అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం. లివర్ జబ్బులను ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించేందుకు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా లివర్‌ను దెబ్బతీసే వైరస్‌లకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. హెపటైటిస్ –బి వైరస్ నియంత్రణ కోసం ప్రతినెలా రూ.2వేలు ఖరీదు చేసే మందులు ఉచితంగా ఇస్తున్నాం. హెపటైటిస్ – సీ జబ్బులకు ఉచితంగా రూ. 20వేలు ఖరీదు చేసే మందులు ఉచితంగా ఇస్తున్నాం. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లివర్ ఆపరేషన్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– డాక్టర్ అనుముల కవిత, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

అందుబాటులో ఆధునిక చికిత్సలు



లివర్ జబ్బులకు నేడు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఫైబ్రో స్కాన్ ద్వారా ప్రాథమిక దశలోనే లివర్ జబ్బులను గుర్తించవచ్చు. బాండింగ్, లివర్ బయాప్సి వంటి ఆధునిక చికిత్సల ద్వారా పూర్తిగా లివర్ సమస్యలను నయం చేయవచ్చు.

– డాక్టర్ యడ్ల హనుమాన్ ప్రసాద్, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

లివర్ క్యాన్సర్‌కు దారితీస్తాయి...



లివర్ క్యాన్సర్లు రావటానికి హెపటైటిస్– బి, హెపటైటిస్–సి వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి(జాండీస్) సోకిన వారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. శరీరంలో హెపటైటిస్ వైరస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారి తీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినటానికి కారణమవుతుంది.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

లివర్‌ను ఇలా కాపాడుకోవాలి..



ఆల్కాహాల్ వల్ల లివర్ దెబ్బతింటుంది కాబట్టి మద్యం జోలికి వెళ్ళవద్దు. కొవ్వు పదార్థాలు, వేపుళ్లు అతిగా తినవద్దు. ఉప్పు, చక్కెర, రెడ్‌మీట్ ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. పచ్చని ఆకు కూరలు లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి.

– డాక్టర్ షేక్ నాగూర్ బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్